
ప్రజాశక్తి
మంగళవారం 2 ఏప్రిల్ 2024



టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జరిగిన ఈ మూల్యాంకనానికి 208మంది స్పెషల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 609 మంది, చీఫ్ ఎగ్జామినర్లు 104 మంది పాల్గొన్నారు. మొత్తంగా 1లక్షా 70వేల 132 ప్రశ్నాపత్రాలను దిద్దాల్సి ఉండగా, తొలిరోజు 12,533 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమం మధ్యాహ్నం వరకు ప్రారంభం కాలేదు. జవాబుపత్రాలు వేరు చేయడం, బ్యాచ్‌ల నియామకం తదితర పనుల వల్ల ఆలస్యంగా మూల్యాంకనం ప్రారంభమైంది. డిఇఒ ప్రేమ్‌కుమార్ మూల్యాంకనాన్ని పరిశీలించారు. ఎండల తీవ్రత, ఉక్కపోతతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.



పరిశ్రమల మూతతో ఉపాధికి గండి

సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. మరో నెలరోజుల్లో పోలింగ్ కూడా జరగనుంది. ఈనేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యే, ఎంపీ, అభ్యర్థులు, నాయకులు ప్రజలను ఓట్లను అభ్యర్థించేందుకు పోటీపడుతున్నారు. ఇటువంటి పోటీ ప్రజాసేవలోనూ, జిల్లా, నియోజకవర్గ అభివృద్ధిలోనూ కనిపించడం లేదు. ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో అభివృద్ధికి పట్టుకొమ్మ వంటి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయలేదు. కొత్త పరిశ్రమలు తీసుకురాలేదు సరికాదా, ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూసివేతకు కారణమయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో మెజార్టీ ప్రజానీకం పొట్టకూటికోసం పుట్టెడు అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురించింది. వీటన్నింటినీ పక్కనబెట్టిన వైసిపి, టిడిపి నాయకులు, అభ్యర్థులు గతంలో ఇచ్చిన హామీలనే తిరిగి వల్లెవేస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నారు.

- వ్యవసాయంలోనూ వెనుకబాటు
- వైసిపి, టిడిపి విధానాలే కారణం
- ఎన్నికలవేళ మరోసారి మోసగించేందుకు యత్నం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 80శాతం ప్రజానీకం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలకుల విధానాల వల్ల వ్యవసాయ విస్తీర్ణం ఏటా తగ్గిపోతోంది. మరోవైపు ఉన్న కొద్దిపాటి పరిశ్రమలు మూతపడుతునే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా అధినేతల పల్లకీలు మోయడం తప్ప రాజకీయంగా జోక్యం చేసుకునే నాధులే జిల్లాలో లేకపోవడంతో ఈ రెండు రంగాల్లోనూ పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. దీంతో, జిల్లాలో గ్రామీణ ముఖచిత్రాలు మారాయి. జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూములు 2శాతం అధికంగా ఉండడం గమనార్హం. సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తికాక పోవడం వల్ల సాగునీటి లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికీ సుమారు 76వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ పనులు చేపట్టి దాదాపు 17ఏళ్లు దాటుతున్నా అతీగతీ లేదు. జంఝావతి ప్రాజెక్టు తలపెట్టిన నాలుగు పదులు ఎప్పుడో దాటిపోయాయి. ఇక మైక్రో ఇరిగేషన్‌కు అనేది దాదాపు లక్ష్యం అనేదే లేకుండా పోయింది. దీనికితోడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించక పోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటివృత్తుల నుంచి నేటితరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మంచి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాల వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ఆచూతూచీ ఓట్లేసుకోవాల్సిన అవసరముందనే చర్చ జనాల్లో ముమ్మరంగా సాగుతోంది.



డామిట్..! కథ అడ్డం తిరిగింది

- స్వతంత్రంగా పోటీకి సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే గీత
- విజయనగరంలో టిడిపికి ఎదురుదెబ్బే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డామిట్...! కథ అడ్డం తిరిగింది. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్యంగా రంగంలోకి దిగేందుకు మాజీ ఎమ్మెల్యే మీసాల గీత సిద్ధమయ్యారు. ఈమేరకు సోమవారం ప్రచారాన్ని కూడా లాంఛనంగా ప్రారంభించారు. కొండ కరకాం, కొత్త అగ్రహారం, నాగవంశపు వీధి, విటి అగ్రహారం, ప్రదీప్‌నగర్, బాబామెట్ట, ఫూల్‌బాగ్‌లో ప్రచారం చేశారు. దీంతో, మిగిలిన నియోజకవర్గాలతోపాటు విజయనగరంలోనూ అసమ్మతి సెగ రాజుకున్నట్టైంది. గీత బరిలో దిగడం అనివార్యమైతే టిడిపికి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్టేనని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. 2014 ఎన్నికల్లో మీసాల గీత విజయనగరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన విషయం విధితమే. అప్పట్లో కేంద్ర మంత్రిగావున్న అశోక్ గజపతిరాజు, గీతను పక్కనబెట్టి నియోజకవర్గంలో రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించారు. ఒకానొక దశలో అధికారిక కార్యక్రమాలు కూడా ఆమెకు తెలియకుండా చేసే పరిస్థితి ఎదురైంది. మరోవైపు ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలన్నా అశోక్ బంగ్లా నుంచి మాత్రమే ప్రకటన చేయాలనే నిబంధన. తీరా బంగ్లాకు వెళ్తే అశోక్ అనుచరులు ప్రతికూల పరిస్థితులను సృష్టించడం పరిపాటిగా మారేది. ఈ వ్యవహారం చిలికిచిలికి గాలివానగా మారడంతో గీత ఎమ్మెల్యేగా ఉండగానే అశోక్‌ను విభేదించారు. ఆయనను సవాలు చేస్తూ బంగ్లాకు సైతం వెళ్లడం మానేశారు. బిసి ఎమ్మెల్యేను కావడం వల్ల వివక్ష చూపుతున్నారని, మహిళను కావడంతో చిన్నచూపు చూస్తున్నారని ఆమె అప్పట్లో ఆరోపించారు. ఈలోపు వచ్చిన 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు తన కుమార్తె అదితి విజయలక్ష్మిగజపతిరాజుకు ఇప్పించుకున్నారు. ఆయన ఎంపీగా పోటీచేశారు. అయినా గీత పార్టీని వీడలేదు. ఆ ఎన్నికల్లో తండ్రి, కూతురూ కూడా ఓటమి చవిచూశారు. గీతను పక్కనబెట్టడం వల్లే బిసి ఓట్లు తగ్గాయని, అందువల్లే అదితికి ఓటమి తప్పలేదని అప్పట్లో చర్చనడించింది. అనంతరం గీత పార్టీలో కొనసాగుతూ తన కేడర్‌తో ఐమేకమై పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కంటోన్మెంట్‌లో ప్రత్యేక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఎత్తివేయాలంటూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ద్వారా అశోక్ ప్రయత్నం చేయడంతో స్థానికంగా తనపై పార్టీలో అణిచివేత చర్యలు జరుగుతున్నాయని, అందువల్లే తన అనుయాయుల అభిప్రాయం మేరకు కార్యాలయం ఏర్పాటు చేశానని సమాధానం చెప్పారు. వాస్తవాలను అర్థం చేసుకున్న హైకమాండ్ కూడా మిన్నకుండిపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా గీత సీటు ఆశించారు. సీటు అశోక్ కుమార్తెకు వచ్చింది. సీటు ప్రకటించే ముందుగానీ, ప్రకటన తరువాత నెలరోజులు కావస్తున్నా గీతకు పార్టీ నుంచి ఎలాంటి దిశా నిర్దేశం లేదు. దీంతో, స్వతంత్రంగా రంగంలోకి దిగాలని కొద్దిరోజులుగా ఆమె అనుయాయులు ఒత్తిడి చేస్తున్నారు. ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్న ఆమె సోమవారం లాంఛనంగా ఎన్నికల ప్రచారానికి నిర్ణయం తీసుకున్నారు. కొంతమంది ముఖ్యులను కలిసి ఆశీర్వదించాలని కోరారు. ఈ పరిణామం టిడిపి అభ్యర్థికి నష్టం చేకూరుస్తుందని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. గీత 2009లో పిఆర్‌పి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరి విజయనగరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2014లో టిడిపి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం విజయనగరం నగరపాలక సంస్థ, రూరల్‌లో ఆమెకు ప్రత్యేక కోటరీ ఉంది.



నారా లోకేష్‌ను కలిసిన బంగార్రాజు, టిడిపి నియోజకవర్గ నాయకులు

కర్రోతుకు ఎమ్మెల్సీ

- హామీ ఇచ్చిన నారా లోకేష్
- కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఆదేశం
- రెండు రోజుల్లో నిర్ణయం చెబుతామన్న బంగార్రాజు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుకు ఎమ్మెల్సీ పదవిని ఆఫర్ చేసినట్లు తెలిస్తోంది. తన అనుచరులతోపాటు సోమవారం మంగళగిరిలోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో కర్రోతు భేటీ అయ్యారు. పొత్తులో భాగంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే టిక్కెట్టును జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ టిక్కెట్టు ఆశించి భంగపడ్డ కర్రోతు బంగార్రాజు అప్పటి నుంచి అదిష్టానం తీరుపై గుర్రుగానే ఉన్నారు. తనకు కచ్చితంగా టిక్కెట్టు ఇవ్వాలని ఒకానొక దశలో ఆందోళనకు దిగారు. తాజాగా కార్యకర్తల ఒత్తిడి మేరకు నెల్లిమర్ల టిక్కెట్టు మార్చకపోతే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో టిడిపి అధిష్టానం నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన లోకేష్‌ను కలిశారు. సుమారు గంట పాటు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై కర్రోతు లోకేష్‌కు వివరించారు. లోకేష్ మాట్లాడుతూ జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పార్టీ అధికారలోకి రాగానే కర్రోతుకు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. నాలుగు మండలాల టిడిపి నాయకులు, జనసేన నాయకులతో కలిసి కట్టుగా పనిచేసి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని ఆదేశించారు. అయితే కర్రోతు తన కార్యకర్తలు, నియోజకవర్గం నాయకులతో మాట్లాడి తన నిర్ణయాన్ని రెండు రోజుల్లో చెబుతామని లోకేష్‌కు చెప్పినట్లు తెలిస్తోంది. లోకేష్‌ను కలిసిన వారిలో నెల్లిమర్ల, భోగాపురం టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాద్ తదితరులున్నారు.

సాగునీరు అందేనా?

సాగునీటి ప్రాజెక్టుల పట్ల టిడిపి, వైసిపి ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఏళ్ల తరబడి ప్రాజెక్టుల కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో శివారు భూములకు నీరందక ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల భూములకు మడ్డువలస, తోటపల్లి జలాశయాల నుండి సాగునీరు సక్రమంగా అందక రైతులకు కడగండ్లే మిగులుతున్నాయి. మడ్డువలస ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలకు లైనింగ్ పనులు, పిల్ల కాలువలకు ఆధునీకరణ పనులు లేక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రేగిడి, సంతకవిటి, గంగవారి సిగడాం మండలాల్లో 52వేల ఎకరాలకు చుక్క నీరు అందక రైతులు నష్టపోతున్నారు. ప్రధాన కాలువలకు లైనింగ్ పనులు లేక పిల్ల కాలువలకు కనీసం చుక్క నీరు రాక కనీసం ఆరుతడి పంటలు కూడా సాగునీరు అందని దుస్థితి నెలకొంది.



మడ్డువలస ప్రధాన కాలువకు పనులు లేక పేరుకుపోయిన కొరబో

- మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల దుస్థితి
- లైనింగ్ పనులు లేక శివారు భూములకు అందని నీరు
- పదేళ్లుగా టిడిపి, వైసిపిదీ ఇదే తీరు




కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి-రేగిడి

తోటపల్లి రిజర్వాయర్ నుండి రాజాం కెనాల్ కు సంబంధించి వంగర, రాజాం, రేగిడి, సంతకవిటి మండలాలతో పాటు జి.సిగడాం మండలాల్లో 39వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ కనీసం పదివేల ఎకరాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. తోటపల్లి రిజర్వాయర్ రాజాం కెనాల్ నుండి పిల్ల కాలువలు తవ్వినప్పటికీ చిన్న శిర్లాం జంక్షన్ వద్ద రాజాం -పాలకొండ ప్రధాన రహదారి తవ్వాల్సిన పరిస్థితి ఉంది. ఇందుకు అనుమతులు లేక పిల్ల కాలువ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. తోకలవలస, తాటిపాడు, సంతకవిటి మండలం గొల్ల సీతారాంపురం పొలాలకు సాగునీరు అందక నేల బావులు, మోటారులపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మడ్డువలస కుడి ప్రధాన కాలువకు కొంతవరకు లైనింగ్ పనులు , పిల్ల కాలువలు తవ్వించి కొన్ని గ్రామాలకు సాగునీరు అందించారు. వైయస్సార్ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లవుతున్నా ఈ ప్రాజెక్టుల ప్రధాన కాలువలు, పిల్ల కాలువల పనులు కనీసం కూడా జరగని పరిస్థితి నెలకొంది. మడ్డువలస, తోటపల్లి ప్రధాన పిల్ల కాలువల ఆధునీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించినప్పటికీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. రానున్న ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులపై ఆధునీకరణ పనులకు నిధులు సమకూర్చి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండింటి నుంచీ నీరు రాలేదు



మడ్డువలస, తోటపల్లి రిజర్వాయర్ నుండి శివార గ్రామాలకు సాగునీరు అందడం లేదు.. సాగునీరు అందక నేలబావులు , మోటార్ బావులతోనే ఆశ్రయించి పంటలు పండిస్తున్నాం.. శివార గ్రామాలకు సాగునీరుకు అందించేందుకు ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

- అంబళ్ల సత్యం, అంబకండి గ్రామం

సాగునీరందిస్తే ఏడాదికి మూడు పంటలు



ఈ రెండు ప్రాజెక్టుల నుంచి ప్రధాన, పిల్ల కాలువలు ద్వారా సాగునీరు అందిస్తే ఏడాదికి మూడు పంటలు పండించవచ్చు. కనీసం ఖరీఫ్ , రబీ పంటలకు కూడా ప్రాజెక్టు నుంచి సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు పండించేందుకు రైతులు, కౌలు రైతులు రావడం లేదు.

- నారు జనార్ధన రావు, రేగిడి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మాత, శిశు మరణాల నియంత్రణే లక్ష్యం

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాతృ శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్యాధికారులు కృషి చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు శిశువుల ఆరోగ్యంపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మరణాల నివారణే లక్ష్యంగా కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు తదితర అంశాలపై సోమవారం డిఎంహెచ్ఒ ఆధ్వర్యాన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులలో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసేవిధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆశా కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మెరుగైన మాతాశిశుఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీలపై అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- భోగాపురం



అధికారులకు ఇచ్చే వినతి పత్రంతో గ్రామ పెద్దలు

క్వారీలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రామచంద్రంపేట, పెద్ద కొండరాజుపాలెం గ్రామాలకు చెందిన పెద్దలు కలెక్టర్ తో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ గ్రామాలకు అనుకొని చుట్టు పక్కల క్వారీలు ఉండటంతో చాలా అవస్థలు పడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా బాంబు పేలుళ్లకు ఇళ్ల పునాదులు కదిలి పోతున్నాయని తెలిపారు. తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన బడి చనిపోతున్నారని పేర్కొన్నారు. పంచాయతీలో అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా క్వారియింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కొత్త క్వారీ ఏర్పాటు చేయవద్దని ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులంతా చెప్పినప్పటికీ ఆ సంస్థకు అనుమతులు మంజూరు చేసారని అన్నారు. ఈ క్వారీకి సమీపంలోనే పాఠశాల, గ్రామానికి సరఫరా చేసే తాగునీటి ట్యాంకు ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా అనుమతులు ఇచ్చేస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. వాహనాల రద్దీతో రహదారులు కూడా పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. అధికారులు ఇచ్చిన పరిమితులకు మించి క్వారీయింగ్ చేస్తున్నందున వీటిపై విచారణ చేయాలని కోరారు. క్వారీల నుంచి మమ్మల్ని కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి, మైనింగ్, పొల్యూషన్ శాఖల అధికారులు కూడా వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుక్క అప్పన్న, రమణ, కోలా రామసూరి, సుగ్గు రాము, గొంప నరసింహ, నువ్వు బంగార్రాజు, రాము, నీలాద్రి బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ యాజమాన్యం మూల్యం చెల్లించక తప్పదు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ హెచ్చరించారు. స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన శిబిరం సోమవారం నాటికి 61వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ఓర్పు, సహనంతో ఉన్నారని వారందరికీ ఆకలి మంటలు రగిలితే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు మిమ్స్ యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. 61రోజులుగా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నిరశన చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 14 సంవత్సరాల నుండి పనిచేస్తున్నా నేటికీ రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన డిఎలు అమలు చేయాలని, పోరాట కాలానికి జీతం చెల్లించేలా మిమ్స్ యాజమాన్యంపై లేబర్ అధికారులు ఒత్తిడి తీసుకు వచ్చి న్యాయమైన సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, గౌరి, మూర్తి, అప్పల నాయుడు, వరలక్ష్మి, బంగారు నాయుడు, ఎం.రాంబాబు, కాము నాయుడు, నాగభూషణం, కుమారి, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస జలాశయంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ వైవి జనార్ధన్ కథనం ప్రకారం..



మృతిచెందిన దేముడు

అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం రైవాడ గ్రామానికి చెందిన కొమర దేముడు (54) వంగర మండలంలోని పటువర్ధనంలో 20 ఏళ్లుగా ఉంటూ మడ్డువలస జలాశయంలో చేపల వేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులతో పాటు, స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. బోటు తిరగబడి ఉండడంతోపాటు ఆయన ధరించిన చెప్పులు సోమవారం కనిపించాయి. అదే చోట ఆయన మృతదేహం లభ్యం అయింది. దీంతో ఆయన భార్య కొమర నూకమ్మ వంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జనార్ధన్ కేసు నమోదు చేశారు. దేముడుకు భార్య నూకమ్మతోపాటు కుమారుడు రాజు, కుమార్తెలు ఆదిలక్ష్మి, వసంత ఉన్నారు.


వైసిపిలో చేరిన పూడివలస గ్రామస్తులు

నిన్న టిడిపిలోకి.. నేడు వైసిపిలోకి

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పూడివలస గ్రామానికి చెందిన 15 కుటుంబాలు బొబ్బిలి కోటలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఆధ్వర్యాన శనివారం టిడిపిలో చేరాయి. అందులో 13 కుటుంబాలు సోమవారం బాడంగిలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమక్షంలో వైసిపిలో చేరడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొబ్బిలి కోటలో టిడిపిలో చేరిన ఒకటి, రెండు కుటుంబాలు మినహా అందరూ పార్టీలోకి రావడం మంచి నిర్ణయమన్నారు. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పూడి బాలకృష్ణ, జెడ్‌పిటిసి రామారావు, తెంటు తిరుపతి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవాలయానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో శ్రీకృష్ణ దేవాలయానికి స్థలం కేటాయించాలని యాదవ సంక్షేమ సంఘం నాయకులు నక్కాన వెంకటరావు యాదవ్ కోరుతూ నగర పంచాయతీ కమిషనర్‌కి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ కార్యాలయం వద్ద గతంలో పాత అన్న క్యాంటీన్ స్థలంలో కన్యకాపరమేశ్వరి దేవాలయం, శ్రీకృష్ణ దేవాలయం నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం చేశారన్నారు. స్థానిక వైశ్యులు కొత్త శ్రీను, నడిపిల్లి అశోక్, గ్రంధి గున్నయ్య శ్రీకృష్ణ దేవాలయానికి స్థలం మినహాయించకుండా మొత్తం స్థలాన్ని దౌర్జన్యంగా కన్యకాపరమేశ్వరి దేవాలయం నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. అధికార్లు వెంటనే స్పందించి శ్రీకృష్ణ దేవాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

నవోదయకు చీకటిపేట విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో చీకటిపేట గ్రామానికి చెందిన విద్యార్థి బత్తిన చందనకృతి నవోదయ విద్యాలయ ఆరోతరగతి ప్రవేశ పరీక్షలో సత్తాచాటింది. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. నవోదయకు తమ కుమార్తె ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు భోజరాజపురం ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రం వద్ద వేగావతి నదిలో ఉన్న ఇన్‌ఫిల్టర్ బావుల్లో పూడికలు తీయనున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

4న కోడూరులో 'జయహో బిసి'

ప్రజాశక్తి-బాడంగి

ఈ నెల నాలుగో తేదిన కోడూరు గ్రామంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొప్పలవెలమ సాధికార సమితి విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కాలువలో పూడికలు తొలగించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మురుగునీటి కాలువలో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. కార్మికులను ఆదేశించారు. పట్టణంలోని మహారాణిపేట, కొత్తఎరుకుల వీధి, సింగారపువీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి కాలువను శుభ్రం చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలన్నారు. రోడ్లపై చెత్త ఉండడంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రేగిడి

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం లక్ష్మంపురంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రజలు సక్రంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సరైన పాలనకు సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఓటర్లు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గిఫ్ట్‌లకు లోను కాకుండా మంచి వారిని ఎన్నుకోవాలన్నారు. ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది శివ ఉన్నారు.

కోండ్రును కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన జనసేన నాయకులు బట్న సత్యవతి, సేనపతి భీముడు, గుణుపూర్ రాము, బలస శామ్, బైరి వెంకటరావు, ఇజ్జు రమణతో పాటు మరికొంత మంది మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళిను సోమవారం రాజాం క్యాంపు కార్యాలయంలో కలిశారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న కోండ్రు మురళిని గెలిపించుకునే దిశగా కృషి చేస్తామని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి ఇంటింటా ప్రచారం చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని టిడిపి కైవసం చేసుకునే విధంగా పనిచేస్తామని చెప్పారు.

వాలంటీర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-వేపాడ

వాలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు, ట్యాబులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యదర్శుల ద్వారా వాలంటీర్ల సెల్‌ఫోన్లు, ట్యాబులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆకుల సీతంపేట ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ముందుగా పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆవరణ, విద్యార్థుల వర్క్ బుక్స్, స్కూల్ డైరీ పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి రామ్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు చిరంజీవి పాల్గొన్నారు.

రేపు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - జామి

వైసిపి గజపతినగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం మండలంలోని కుమరాం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ జి.రవికుమార్ తెలిపారు. సమావేశానికి మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు కానున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న నేపథ్యంలో గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మినీ రిజర్వాయర్ ఊసేలేదు

- రూ.6 కోట్లు నిధులిస్తామన్న విశాఖ డెయిరీ
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన టిడిపి, వైసిపి పాలకులు
- రైతులకు అందని సాగునీరు

ప్రజాశక్తి-వేపాడ

వీలుపర్తి రెవెన్యూ పరిధిలో మినీ రిజర్వాయర్ ఏర్పాటుపై గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం నిలువునా కమ్మేసింది. ఏళ్ల తరబడి మినీ రిజర్వాయర్ ఊసే లేకుండా పోయింది. రైతుల శ్రేయస్సు కోసం విశాఖ డెయిరీ రూ.6 కోట్ల నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చినా, పాలకుల అలసత్వంతో ఆ నిధులు అక్కరకు రాకుండా పోయాయి. దీంతో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.


మినీ రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతంలో క్వారీ నిర్వహిస్తున్న దృశ్యం

వేపాడ మండలంలోని మారిక కొండల మీద నుంచి వచ్చే నీటిని ఒడిసిపడితే వేల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందించవచ్చు. వేపాడ, లక్కవరపుకోట, శృంగవరపుకోట మండలాల్లోని ఐదు వేల ఎకరాలను సస్యశ్యామలం చేయొచ్చు. అందుకు వీలుపర్తి రెవెన్యూ పరిధిలోని బోడిమెట్ట, పందిమెట్ట మధ్య మినీ రిజర్వాయర్ చేయాలన్నది ఆలోచన. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత రైతుల శ్రేయస్సు దృష్ట్యా అప్పటి విశాఖ డెయిరీ చైర్మన్ అడారి తులసీరావు డెయిరీ నుంచి ఆరు కోట్లు నిధులు మంజూరుకు హామీనిచ్చారు. ఆ నిధులతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తే మూడు మండలాల రైతులకు మేలు జరుగుతుందని తులసీరావు ముందుకొచ్చారు. అందుకు అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూడా చొరవచూపారు. మినీ రిజర్వాయర్ నిర్మాణం వల్ల రైతులకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందని అప్పటి జిల్లా కలెక్టర్ ఎం.ఎం. నాయక్ పరిశీలన కూడా చేశారు. కలెక్టర్ కూడా మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ఆమోదం కూడా తెలిపారు. ఇంతలో ఏమి జరిగిందో మినీ రిజర్వాయర్ పనులు మాత్రం ప్రారంభమే కాలేదు. గత ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. అనంతరం 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మినీ రిజర్వాయరు ఊసే ఎత్తలేదు. సమావేశాల్లో మాత్రం తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అంటూ చెప్పుకోవడమే తప్ప ఐదు వేల మంది రైతులకు ఉపయోగపడే మినీ రిజర్వాయర్ గురించి పట్టించుకోలేదు.

అందుకేనా వెనుకడుగు?

మూడు మండలాల రైతుల భవిష్యత్తుతో ముడిపడిన ప్రాజెక్టుకు విశాఖ డెయిరీ నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. కానీ రైతుల శ్రేయస్సు కన్నా ముందు నాటి టిడిపి, ప్రస్తుత వైసిపి పాలకులు స్వలాభం చూసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. వీలుపర్తి రెవెన్యూ పరిధిలోని బోడిమెట్ట, పందిమెట్ట కొండల మధ్య మినీ రిజర్వాయర్ ఏర్పాటుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. సర్వే నంబరు 2, 33లో ఉన్న అదే కొండలను రిగ్ బ్లాస్టింగ్ చేస్తూ దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఆ క్వారీలు నిర్వహిస్తున్న యజమానులు.. స్థానిక ప్రజాప్రతినిధులు కుమ్మక్కయ్యారు. దీనివల్ల గత, ప్రస్తుత స్థానిక ప్రజాప్రతి నిధులకు కాసుల పంట పండిందన్నది రైతుల ఆరోపణ. అందుకే మినీ రిజర్వాయర్ గురించి గత, ప్రస్తుత పాలకులు పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. క్వారీల వల్ల ఈ ప్రాంతంలో ఉన్న రైతుల పంటలకు భారీగా నష్టం వాటిల్లుతోంది. అయినా అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేకంగా పరిశీలన చేస్తే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావని పరిసర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావును చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలకు చెందిన కొంతమంది నాయకులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. సోమవారం రాజాం వెళ్లి కళా వెంకటరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం సమన్వయంతో పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కళాను కలిసిన వారిలో రెడ్డి గోవిందబాబు, వెంపడాపు రమణమూర్తి, లక్ష్మీనారాయణ, వలిరెడ్డి శ్రీరాములు నాయుడు, రౌతు రమేష్‌నాయుడు, అడపా సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

తప్పుడు రాతలు సరికాదు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పి.అశోక్ గజపతిరాజు రాజకీయాలకు స్వస్తి పలికినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను టిడిపి నాయకులు ఖండించారు. తప్పుడు వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు కర్రోతు నర్సింగరావు, పిల్లా విజయ్ కుమార్ మాట్లాడారు. చంద్రబాబుపై సీనియర్ నేత అశోక్ గజపతిరాజు అసహనం వ్యక్తం చేసినట్లు, చంద్రబాబు నిర్ణయం వల్లనే పార్టీ నాశనం అయ్యిందని అశోక్ అన్నట్లు మీడియాలో ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు.

అచ్చెన్నకు పరామర్శ

విజయనగరంకోట : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతి ఆదివారం కన్నుమూశారు. ఈనేపథ్యంలో విజయనగరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి విజయలక్ష్మి తదితరులు సోమవారం నిమ్మాడ గ్రామంలో అచ్చెన్నాయుడును కలిసి పరామర్శించారు.

రాజకీయ కక్షతో వృద్ధులకు ఇబ్బందులు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాజకీయ కక్షతో వృద్ధులను ఇబ్బందులు పెట్టడం అన్యాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకు ఇచ్చేందుకు వైసిపి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను తీసుకొస్తే నేడు ఎన్నికల్లో ఓటమి భయంతో వాలంటీర్ల పింఛన్లు పంపిణీ చేయకుండా మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌తో అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. నిమ్మగడ్డ రమేష్‌ను అడ్డం పెట్టుకుని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి వాలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. వాలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపికి పని చేస్తామని ముందుకు వస్తున్నారని చెప్పారు. వాలంటీర్లు బాధపడవద్దన్నారు.

నేడు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

స్థానిక సూర్య రెసిడెన్సీ సమీపంలో మంగళవారం వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి చెప్పారు. సమావేశానికి వైసిపి ఉత్తరాంధ్ర కన్వీనర్ వైవి సుబ్బారెడ్డి, కోకన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్లు విస్సు, దామోదర్ ఉన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- గంట్యాడ/జామి


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసిపి పూర్తిగా నాశనం చేసిందని గజపతినగరం నియోజకకవర్గం టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. సోమవారం జామి, గంట్యాడ మండల కేంద్రాల్లో జరిగిన పార్టీ క్లస్టర్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో భీమసింగి సుగర్స్‌ను అభివృద్ధి చేస్తే వైసిపి దాన్ని పూర్తిగా నాశనం చేసిందన్నారు. చంద్రబాబు సిఎం అయితే ఫ్యాక్టరీని తెరిపిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఉపాధి లేక యువత వలస పోతున్నారని, వీటిని అరికట్టేందుకు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. మాజీ ఎంపిపి కొండలరావు మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగానే శ్రీనివాస్‌కు టిక్కెట్ కేటాయించారని అందరూ సహకరించి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.స్వామినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. గంట్యాడలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, రంధి రామునాయుడు, వర్రి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో కుంటుపడిన అభివృద్ధి

టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి


ప్రచారం చేస్తున్న బేబినాయన

వైసిపి పాలనలో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మున్సిపాలిటీలోని అప్పయ్యపేట, సింగారపువీధిలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ సమస్యతో యువత బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు శరత్, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిటిసి రవీంద్రనాథ్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యోగ విరమణ చేసిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జిఆర్ రవీంద్రనాధ్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో రవీంద్రనాధ్‌ను విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో మూడు జిల్లాల రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఆ శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వడ్డీ సుందర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రవీంద్రనాధ్ శాఖాపరంగా చేసిన సేవలను కొనియాడారు. సుమారు 36 ఏళ్లపాటు రవాణాశాఖలో సుదీర్ఘ సేవలందించిన రవీంద్రనాథ్, విధి నిర్వహణలో విశేషంగా రాణించారని అన్నారు. ఆయన సిన్సియారిటీ, కార్యదక్షత, సహృదయత ఇతరులకు ఆదర్శమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా నుంచి ఆర్‌టిఒ రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

వైసిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

రానున్న ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అభివృద్ధి చెందలేదని భావిస్తే తమకు ఓటు వేయవద్దని అన్నారు. ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ప్రశాంతి నగర్ ప్రాంతం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వము అందించిన సంక్షేమ పథకాలు, వివరించారు. ఈ సందర్భంగా ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంచ, ప్రజల కనీస అవసరాలను తీర్చడం బాధ్యతగా తీసుకున్నామన్నారు. అందువల్లనే నగరం అన్ని రంగాలలో అభివద్ధి చెందిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజలను మభ్య పెట్టే విధంగా ప్రతిపక్షం లేనిపోని అవాస్తవాలను మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు

వెంపడాంలో బడ్డుకొండ ప్రచారం


వెంపడాంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : మండలంలోని వెంపడాం, తాళ్లపేట గ్రామాల్లో సోమవారం నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందించే ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. మరోసారి నెల్లిమర్ల వైసిపి ఎమ్మెల్యేగా తనను, విజయనగరం ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ని ఆశీర్వదించాలన్నారు. ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయడు, నాయకులు మహంతి శ్రీనివాసరావు పిన్నింటి వెంకటరమణ, యల్లంనాయుడు, సర్పంచ్ పిన్నింటి కుమార్, జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, యడ్ల రామకృష్ణ, దేశెట్టి గణేష్, శాంతాటి శ్రీనువాసరావు, పల్లా సత్యం తదితరులు పాల్గొన్నారు.

సేవలు లేకుంటే వృద్ధులకు ఇబ్బందే : కడుబండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వాలంటీర్ల సేవలను వినియోగించకుంటే వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడతారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండల స్థాయి బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు, పేదలకు, వృద్ధులకు, వితంతువులకు పెద్ద దిక్కుగా ఉందన్నారు. వారికి వాలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా ఎలక్షన్ కమిషన్ నిర్ణయం తీసుకోవడం వల్ల ఇబ్బందులు పడతారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలకు బూత్ కన్వీనర్ల పాత్రే కీలకమన్నారు. ప్రతి కుటుంబాన్నీ కలిసి సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. అనంతరం బొడ్డవర వైసిపి నాయకుడు సాంబరాజు ఆధ్వర్యంలో 26 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, జెడ్‌పిటిసి ముమ్ములూరు వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, రాష్ట్ర ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, కె.వెంకటరమణ, వాకాడ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో లోకం మాధవి పర్యటన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కనిమెట్ట, కందివలస, చోడవరంలో సోమవారం ఎన్‌డిఎ కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తనను మీ ఆడబిడ్డలా ఆశీర్వదించాలని కోరారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాలను ప్రాంతాలను అభివృద్ధి చేస్తానన్నారు. గత పాలకుల వల్ల ఈ ప్రాంతాలు అబివృద్ధి చెందలేదన్నారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నానని చెప్పారు. ఈ ప్రాంతాన్ని కాలుష్యం లేని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రచారంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి తమ్మునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు జలపారి శివ, నాయకులు బూర్లె విజయశంకర్, దుక్క అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


దగ్ధమవుతున్న షాపులు

రెండు షాపులు దగ్ధం

రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని బైరిపురం బస్టాండ్ ఆవరణలోని కొత్త వీధిలో ఆదివారం అర్ధ రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు షాపులు దగ్ధమయ్యాయి. ఒక్కసారి అగ్ని కీలలు ఎగిసి పడటంతో చుట్టు పక్కల ఉన్న వాళ్ళు భయభ్రాంతులకు గురయ్యారు. ఉవ్వెత్తిన మంటలు దట్టమైన పొగలు వ్యాప్తించటంతో ఎమైందో తెలియక భయంతో పరుగులు తీశారు. స్థానికల వివరాలు ప్రకారం.. బైరిపురం బస్టాండ్ ఆవరణలో ఉన్న ముత్యాల అచ్చిరాజు, సబ్బిశెట్టి లక్ష్మణలకు సంబంధించిన పాన్ షాపులు వెనుక భాగము నుండి ఆదివారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో దట్టమైన పొగలతో కూడిన అగ్ని మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఈ విషయాన్ని షాపుల యజమానులకు తెలియజేయడంతో వారు వచ్చేసరికే మంటలు పూర్తిగా వ్యాపించాయి. దీంతో మంటలను అదుపు చేయలేకపోయారు. విషయం తెలుసుకున్న బైరిపురం ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, కందుల మల్లి కార్జునరావు, కందుల శ్రీనివాసరావు వెంటనే చీపురుపల్లి అగ్ని మాపక సిబ్బందికి తెలియ చేయగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పూర్తిగా షాపులు, వాటిలో ఉన్న సామాగ్రి కాళిపోయాయి. షాప్ యజమానులు గత 30 ఏళ్లుగా వాటి మీదే ఆధారపడి వారి కుటుంబాలను పోసిస్తున్నారు. ఇంతలో ఇలా జరగడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. సుమారు రూ.15లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. మంటలకు కారణం షాట్ సర్క్యూట్ లేదా ఎవరైనా చేసి వుంటారా? అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

3200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కొయ్యకొండవలసలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 3200 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బివి మురళీధర్ చెప్పారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐలు రామారావు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.